క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



కంకిపాడు: కోలవెన్ను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బిట్రా జ్యోతికుమారి మంగళవారం పాఠశాలకు మైక్ సెట్ వితరణగా అందజేశారు. తల్లిదండ్రుల సమావేశం, అసెంబ్లీ నిర్వహణకు అవసరమైన మైక్‌సెట్‌ను రూ రూ.10 వేలతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రత్నకుమారి, ఉపాధ్యాయులు శొంఠి మాధవరావు, జి.ఉషశ్రీ, ఎం.రంగమాధవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని రామానగర్, శివాలయం ఏరియా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

కానూరు మహదేవపురం పరిధిలో..

పెనమలూరు: కానూరులో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ మహదేవపురం సబ్‌స్టేషన్ పరిధిలోని తులసీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా తులసీనగర్, వరలక్ష్మీపురం, పంట కాలువ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



అనంత శశికళ

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కె.అనంత శశికళకు డాక్టరేట్ వచ్చిందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. ఈసందర్భంగా ఆమెను అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు కావడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడంకి గ్రామానికి చెందిన ఎ.వెంకటేశ్వరరావు అంబాపురంలో ఉన్న అతని అల్లుడు బి.లక్ష్మణరావు ఇంటికి సోమవారం బైక్‌పై బయలుదేరాడు. అతను కానూరు 100 అడుగుల రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గాయపడిన వృద్ధుడిని పోరంకిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై క్షతగాత్రుడి అల్లుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన



ఉంగుటూరు: మండల పరిధిలోని ఆత్కూరు గ్రామంలో రూ.76 లక్షలతో నిర్మించనున్న రెండు సీసీ రహదారులకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు అడుసుమిల్లి రాంబ్రహ్మం, టీడీపీ నాయకులు అట్లూరి రామ్‌కిరణ్, సృజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సేవా సంఘం

- పేద వృద్ధులకు భోజనం అందజేత
- సామాజిక సేవలో మదర్‌థెరిస్సా 'వెలుగు' పిల్లలు, వృద్ధులు ఆశ్రమ సేవా సంఘం

అయిన వారే పట్టించుకోని రోజులివి.. అలాంటిది ఏళ్ల తరబడి అన్నార్తులకు నేనున్నా అంటూ తోడుగా నిలుస్తోంది మదర్‌థెరిస్సా 'వెలుగు' పిల్లలు, వృద్ధుల ఆశ్రమ సేవా సంఘం. ఎవరూ లేని వృద్ధులకు అండగా ఉంటోంది. వీరికి రోజూ రెండు పూటలా కడుపు నిండా భోజనం అందిస్తూ తమ వంతు సామాజిక సేవలో తరిస్తోంది. దాతలను సమకూర్చి పేదల ఆకలి తీరుస్తున్నారు. వారి సేవలను పలువురు అభినందిస్తున్నారు.

కంకిపాడు: మదర్‌థెరిస్సా 'వెలుగు' పిల్లలు, వృద్ధుల ఆశ్రమ సేవా సంఘం వృద్ధులు, దివ్యాంగులు, అభాగ్యులకు అండగా నిలుస్తోంది. మండలంలోని మారేడుమాక కేంద్రంగా 2015వ సంవత్సరంలో ఆశ్రమ సేవా సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘానికి అధ్యక్షుడిగా లాం కిరణ్‌కుమార్, నిర్వాహకురాలిగా లాం స్వర్ణకుమారి వ్యవహరిస్తున్నారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి ఆదరణ లేని వృద్ధులు, దివ్యాంగుల ఆకలి దప్పులు తీరుస్తూ వారిలో మనో ధైర్యాన్ని నింపుతోంది.

మానవ సేవే.. మాధవ సేవ

మానవ సేవే.. మాధవ సేవ అంటారు. ఆ మాటలను పూర్తిస్థాయిలో విశ్వసించారు ఈ దంపతులు. 2004 వరకూ గ్రామంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ, దైవారాధనలో జీవితాన్ని వెళ్లదీసేవారు. హోటల్ వద్దకు పలువురు వృద్ధులు వచ్చి ఆకలికి పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూసి చలించారు. బీదలకు సాయం చేస్తే భగవంతుడు సాయం అందిస్తాడనే బైబిల్‌లోని మాటలను నమ్మి ఈ సేవకు శ్రీకారం చుట్టారు. కంకిపాడు, ఉంగుటూరు మండలాల్లోని తెన్నేరు, మారేడుమాక, చికినాల, బొకినాల, మానికొండ గ్రామాల్లోని 25 మంది పేద వృద్ధులను ఎంపిక చేసుకున్నారు. వారికి రోజూ రెండు పూటలకు సరిపడా భోజనాన్ని స్వయంగా వండి వారి ఇంటికే వెళ్లి భోజనం క్యారేజ్‌లను అందిస్తున్నారు స్వర్ణకుమారి, కిరణ్‌కుమార్ దంపతులు.



మారేడుమాకలో వృద్ధులకు భోజనాలు అందజేస్తున్న సేవా సంఘం నిర్వాహకులు

కరోనా వేళ అద్భుత సేవలు

కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనటం తెలిసిందే. వ్యాధి విజృంభణను సైతం స్వర్ణకుమారి, కిరణ్‌కుమార్ దంపతులు ఖాతరు చేయలేదు. ఆ సమయంలో వృద్ధులకు అవసరమైన మందులు, తాగునీటి అవసరాలను సైతం ఈ సంఘం తీర్చింది. దాతలను సమీకరించి రోజూ వృద్ధులకు భోజనాన్ని సమకూరుస్తూ అన్నార్తుల ఆకలి తీర్చారు.



భోజనాన్ని క్యారేజీల్లో సర్దుతున్న కిరణ్‌కుమార్, స్వర్ణకుమారి దంపతులు

చురుగ్గా ఆశ్రమ నిర్మాణ పనులు

అభాగ్యులైన పిల్లలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించాలనే సంకల్పంతో గ్రామంలో ఆశ్రమ నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆశ్రమ నిర్మాణం పూర్తయితే అభాగ్యులకు ఆశ్రయం కల్పించి వారి బాగోగులు చూడాలనే ఆకాంక్షతో ఉన్నారు.

ఆశ్రమ నిర్మాణం కల



నిత్యం దేవుడి సేవలో ఉండే వాళ్లం. పేదలకు సేవ చేస్తే ఆ దేవుడు సాయం అందిస్తాడనే నమ్మాం. అనుకున్నదే తడువుగా సంఘాన్ని ఏర్పాటుచేసి రోజూ 25 మంది పేదలకు కడుపు నింపు పని మొదలుపెట్టాం. దాతల సాయంతో నిర్విరామంగా సాగుతోంది. అభాగ్యుల కోసం ఆశ్రమం నిర్మాణం చేపట్టాం. వారి అగచాట్లు తీర్చాలనేది మా కోరిక.

– లాం కిరణ్‌కుమార్, స్వర్ణకుమారి దంపతులు, మదర్‌థెరిస్సా 'వెలుగు' పిల్లలు, వృద్ధుల ఆశ్రమ సేవా సంఘం (90108 97551, 91105 79911)

కన్నవాళ్ల కంటే ఎక్కువగా చూస్తారు



కన్నవాళ్ల కంటే ఎక్కువగా ప్రేమ పంచుతారు. ఎంతో శుచిగా, శుభ్రంగా భోజనం తయారు చేసి రెండు పూటలా సరిపోయేలా భోజనం పెడతారు. ఆప్యాయంగా.. కన్నవాళ్ల మాదిరిగానే చూసుకుంటారు. వాళ్ల మేలు జీవితంలో మర్చిపోలేం.

– కనగాల అన్నపూర్ణమ్మ, మారేడుమాక

మాబోటి పేదలకు అండ



రెక్కాడితే కానీ డొక్కాడదు. ఈ వయసులో బయటి పనులకు వెళ్లలేం. ఓపిక తెచ్చుకుని కష్టం చేస్తే నాలుగు మెతుకులు తినేది. కానీ మాబోటి పేదలకు సంఘం అండగా ఉంది. ఎలాంటి పరిస్థితులో అయినా తిండికి ఇబ్బంది లేకుండా భోజనం సమకూరుస్తున్నారు. ఆకలి బాధ లేకుండా చూస్తున్నారు.

– మోతే సూరయ్య కుటుంబం, మారేడుమాక

ముస్తాబాదలో నేడు చెస్ టోర్నమెంట్

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదకు చెందిన ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ వ్యవస్థాపకుడు చదరంగం(చెస్) అంతర్జాతీయ కోచ్ విఆర్ బొబ్బా తండ్రి బొబ్బా రత్నారావు స్మారకార్థం ఈ నెల 22న గ్రామంలో చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాస్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొబ్బా రత్నారావు ఈ నెల 12వ తేదీన మృతి చెందగా ఆయన స్మారకార్థం రూ.1.12 లక్షల నగదు బహుమతితో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో అకాడమీ ప్రస్తుత, పాత క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. మొత్తం 14 విభాగాల్లో చెస్ పోటీలు ఉంటాయని ఒక్కో గ్రూపులో రూ.8 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. విజేతలకు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు బుధవారం ఉదయం 11 గంటలలోపు ముస్తాబాదలోని రామాలయం ఎదురుగా ఉన్న అకాడమీలో రిపోర్టు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 92474 84849 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో దాత పెద్దిరెడ్డి నారాయణమూర్తి(సత్రంపాడు) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వర వీర వెంకట సత్యనారాయణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: పశు పోషకులు మేలైన యాజమాన్యంతో పశువుల పెంపకం చేయాలని పశు సంవర్ధక శాఖ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ పద్మ అన్నారు. పోరంకిలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. పశు పోషకులకు ఉచిత ఆరోగ్య సేవలు అందించటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పశు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధుల చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణకు మందులు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, పలు సేవలు అందిస్తామని చెప్పారు. పశు సంవర్ధక శాఖ డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరాలతో పశుపోషకులకు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా 150 పశువులకు వైద్యం చేశారు. అనంతరం దూడల అందాల పోటీలు నిర్వహించారు. గన్నవరం పశుగణాభివృద్ధి కేంద్రం సహకారంతో బహుమతులు అందజేశారు. వైద్య శిబిరంలో గేదెలకు, ఆవులకు చూడి పరీక్షలు, తిరగపార్లే పశువులకు వైద్యం చేశారు. కార్యక్రమంలో పెనమలూరు ఏడీ శ్రీనివాసరావు, పశువ్యాధి నిర్ధారణ ఏడీ సృజన, ఏడీ జగన్నాథరావు, వైద్యులు బాబూరావు, మాధవరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మంచినేని పరమేష్, పశు పోషకులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం

కంకిపాడు: పశు పోషణలో జాగ్రత్తలు అవసరమని కుందేరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ రంగారావు సూచించారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం మంగళవారం నిర్వహించారు. పశువులకు చూడి పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ పశు పోషకులు సీజన్‌కు అనుగుణంగా పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. సకాలంలో టీకాలు, మందులు అందజేయాలన్నారు. పశు పోషణలో మెలకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



పోరంకిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

శిబిరాలను సద్వినియోగించుకోవాలి

ఉంగుటూరు: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు పశు వైద్య అధికారి స్వర్ణలత అన్నారు. మండలంలో గారపాడు, ఎలుకపాడు గ్రామాల్లో మంగళవారం పశువైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 60 గేదెలు, ఐదు ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 20 దూడలు, 170 మేకలకు నట్టల నివారణ మందు, సుమారు 120 పెరటి కోళ్లకు యాంటీబయోటిక్ మందులు వేశారు. గారపాడులో తేలప్రోలు పశు వైద్యాధికారి సీహెచ్ మల్లిబాబు, పశు పోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపావులూరులో..

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరు గ్రామంలో మంగళవారం ముస్తాబాద పశు వైద్య చికిత్సా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మేరీ వైడూర్యం పాల్గొని పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పశు వైద్య శిబిరాల సేవలను పశుపోషకులు వినియోగించుకోవాలని సూచించారు. కొండపావులూరు ఆస్పత్రి ఇన్‌చార్జి హుస్సేన్, ఎంపీటీసీ సభ్యుడు కొవ్వలి రాజు, పశు పోషకులు పాల్గొన్నారు.



తెన్నేరులో మందులు అందజేస్తున్న సర్పంచ్ ఎలీషా, డాక్టర్ రంగారావు తదితరులు



వీరవల్లిలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశు వైద్యాధికారులు

వీరవల్లిలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 గేదెలు, 10 ఆవులు, 100 కోళ్లు, 180 మేకలు, గొర్రెలకు వివిధ వ్యాధులకు సంబంధించిన టీకాలు, మందులు అందించారు. వీరవల్లి ప్రభుత్వ పశు వైద్యశాలకు చెందిన డాక్టర్ దివ్య, సిబ్బంది సేవలు అందించారు. సర్పంచ్ పిల్లా అనిత, గ్రామ ప్రముఖులు గుండపనేని ఉమావరప్రసాద్, కోడెబోయిన బాబీ పాల్గొన్నారు.

రబ్బీస్ క్వారీల్లో అధికారుల తనిఖీలు

పి.నైనవరం(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో గతంలో తవ్విన రబ్బీస్ క్వారీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సర్వే నంబర్లు 101/2, నుంచి 9 వరకు ఉన్న సుమారు 10 ఎకరాల్లో తవ్విన రబ్బీస్ క్వారీలను అధికారులు పరిశీలించారు. మైనింగ్ శాఖ నిర్ణయించిన కొలతల ప్రకారం కాకుండా అధికంగా లోతు తవ్వడం, కొంత ప్రాంతాన్ని ఆక్రమించుకొని రబ్బీస్ తవ్వి రవాణా చేసినట్లు గ్రామస్తులు మైనింగ్ కార్యాలయానికి చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మైనింగ్ డీడీ శ్రీనివాసులు ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మైనింగ్ అధికారులు తెలియజేశారు. తనిఖీల్లో మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ నడపన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, వీఆర్వో రిజ్వానాబేగం, విలేజ్ సర్వేయర్ అభిలాష్ పాల్గొన్నారు.



పి.నైనవరంలో మ్యాప్ పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

15న ఉచిత మెగా వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ ప్రాంగణంలో ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో గుండె, మెదడు, నరాలు, జీర్ణకోశ, కీళ్లు, ఎండోక్రైనాలజీ, శ్వాసకోశ, ఎముకలు, జనరల్ మెడిసిన్, స్త్రీ, ప్రసూతి, ఆప్తమాలజీ, నేత్ర వైద్య నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. బీపీ, 2డీ ఎకో, షుగర్, ఇసీజీ, పీఎఫ్‌టీ, హెచ్‌బీఏ1సీ తదితర పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే రోగులు ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వివరాలను 81870 34999, 82970 00472, 90521 91190 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. వైద్యశిబిరాన్ని గన్నవరం, పరిసరా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక, సామాజిక భద్రతే లక్ష్యం



కరపత్రాలు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహేందర్‌రెడ్డి

కంకిపాడు: ప్రజలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించటమే లక్ష్యమని కృష్ణా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆర్‌బీఐ సౌజన్యంతో ఈడుపుగల్లులో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం బ్యాంకులు అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చాయన్నారు. పేదరిక నిర్మూలనకు పథకాలు దోహదపడుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఈడుపుగల్లు యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, మహిళా పోలీసు దుర్గాభవాని, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సమన్వయకర్త ఆశ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. స్నేహితులు లేదా ఇతరులు మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా తిరస్కరించాలన్నారు. కృష్ణలంకలోని వంగవీటి మోహనరంగా నగరపాలక సంస్థ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన మంగళవారం మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ తెలిసో తెలియక మాదక ద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారని, ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమేనన్నారు. మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దని, వాటితో ఆరోగ్యం క్షీణించడం, సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతారని చెప్పారు. మాదక ద్రవ్యాలతో క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, సరైన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని సూచించారు.

డీ-ఎడిక్షన్‌తో సాధారణ స్థితి..

నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్లు కె.ప్రియాంక, విజయరాణి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. వివరాలకు నూజివీడులో నవజీవన్ బాలభవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రేసమ్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్న శేఖర్‌బాబు

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం సుందరకాండ పారాయణం భక్తిశ్రద్ధలతో జరిగింది. వికాస తరంగిణి ఆధ్వర్యంలో ముముక్షు భజన సమాజం సభ్యులు సుందరకాండను ఆలపించారు. ఇప్పటి వరకు హనుమాన్‌జంక్షన్ ఏరియాలో 37 చోట్ల సుందరకాండ పారాయణం చేశామని ముముక్షు భజన సమాజం అధ్యక్షురాలు మండలాపు సులోచన తెలిపారు. మాజీ సర్పంచ్ కాకాని అరుణ, భక్తులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో ఆర్థికాభ్యున్నతి

ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళల ఆర్థికాభ్యున్నతికి టైలరింగ్ దోహదపడుతుందని మెస్సీయ ఫెలోషిప్ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని చర్చి ఆవరణలో మంగళవారం కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యాన ఉచిత మహిళ కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణకు నగరానికి చెందిన 80 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే 15 బ్యాచ్‌ల శిక్షణ పూర్తి చేశామని, 16వ బ్యాచ్‌ని ప్రారంభించామని తెలిపారు. ఏటా రెండు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఎనిమిదేళ్లుగా సుమారు వెయ్యి మంది మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో నైపుణ్యం చూపిన ఏడు వందల మందికి పైగా ఉచితంగా కుట్టు మిషన్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణ చైర్‌పర్సన్ సజ్జా జ్యోతి, టీచర్లు కృష్ణవేణి, సంతోషం, సంపూర్ణ, దీప తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సజ్జా రత్నకుమార్

ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలి



హెల్మెట్ ధరింపజేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

గన్నవరం: ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు సూచించారు. గన్నవరం పరిసరా ప్రాంతాల్లో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రతి ఏటా వేలాది మంది మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం కారణంగానే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.